ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
5
ములుగు
గురువారం 2 మే 2024


రోడ్ షోలో మాజీ సీఎం కేసీఆర్ అభివాదం

మానుకోటలో కేసీఆర్ రోడ్ షోకు హాజరైన జనం

ఉచిత బస్సు తప్ప.. అంతా ఉత్తుత్తే

మాజీ సీఎం కేసీఆర్ ఖుషీ..

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రోడ్‌షోకు జనం భారీగా తరలిరావడంతో మాజీ సీఎం కేసీఆర్ ఖుషీ అయ్యారు. భద్రాద్రి జిల్లా నుంచి మానుకోటకు చేరుకున్న కేసీఆర్‌కు పట్టణ శివార్లలో నేతలు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇందిరాగాంధీ సెంటర్ వరకు రోడ్‌షో నిర్వహించారు. బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలంగాణ పాటలకు నృత్యాలు చేశారు. సభ ప్రదేశంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాలతో ఎగురవేసిన బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. యంత్రాల ద్వారా చల్లిన గులాబీ రంగు కాగితాలతో ఆ ప్రాంతమంతా గులాబీమయమైంది.

- కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో హామీలేవీ నెరవేరడం లేదు
- మానుకోట జిల్లా ఉండాలంటే. బీఆర్ఎస్ గెలవాలె
- బస్సుయాత్ర, కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్

మహబూబాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ దుష్ట పరిపాలనలో ఉచితబస్సు తప్ప.. ఇతర హామీలేవి అమలు కావడం లేదని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న బస్సుయాత్ర బుధవారం సాయంత్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి రాత్రి 7.10గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. కానీ ఆయన ప్రచారంపై బుధవారం రాత్రి 8గంటల నుంచి 48 గంటల పాటు ఎన్నికల కమిషన్ నిషేధం విధించిన నేపథ్యంలో.. 7.20గంటలకు ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకున్న ఆయన 14 నిమిషాల పాటు ప్రసంగించారు. తాను మారుమూల గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేస్తామని స్పష్టంగా చెబుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికి బ్రేక్ వేయాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. తన ప్రచారంపై 48 గంటల పాటు నిషేధం విధిస్తే.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు 96 గంటలు అవిశ్రాంతంగా పనిచేస్తారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు నష్టపోతున్నారని, కరీంనగర్ జిల్లాలో వడ్లు కొనడం లేదని, వాటిని ఆరబెట్టుకున్న ఓ రైతు కుప్పకూలి గుండెఆగి మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకంతో ఆటోరిక్షా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో ఈ ప్రాంతానికి ఎన్నడు నీళ్లు రాలేదని, వెన్నవరం కాలువల ద్వారా చుక్క నీరు రాలేదని, కాళేశ్వరం కట్టిన తర్వాతనే వెన్నవరం కాలువల ద్వారా నీళ్లు వచ్చాయని వివరించారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు నీరు ఎందుకు రాలేదంటూ ప్రజలను ఈ సందర్భంగా కేసీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని, రైతుబంధు ఇవ్వడం లేదని, అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణకు న్యాయం చేసేందుకు తనగొంతులో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం గోదావరి నీళ్లను తీసుకుపోతోందని, సీఎం రేవంత్‌రెడ్డి మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఖమ్మంలో మురికినీరు వస్తోందని విచారం వ్యక్తం చేశారు. కరెంట్, భగీరథ పథకాలు ఎక్కడికి పోయాయయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులను గౌరవించలేదని, మహబూబాబాద్ ప్రాంతంలో సేవాలాల్ దేవాలయాన్ని బీఆర్ఎస్ పాలనలో నిర్మించామని, గిరిజనులకు రిజర్వేషన్లను కల్పించామని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్నర్ మీటింగ్‌లో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, ఎమ్మెల్సీలు వద్దిరాజు రవిచంద్ర, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియ, రేగ కాంతారావు, మానుకోట, ములుగు జడ్పీ చైర్‌పర్సన్‌లు అంగోతు బిందు, బడె నాగజ్యోతి, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్ఎన్.రెడ్డి, గుడిపుడి నవీన్‌రావు, కుడితి మహేందర్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఎండి.ఫరీద్, చిట్యాల జనార్దన్, షేక్.మహబూబ్‌పాషా, తేళ్ల శ్రీనివాస్, నాయిని రంజిత్, సుదాగాని మురళి, ముత్యం వెంకన్న పాల్గొన్నారు.


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేసీఆర్

శ్రమ దోపిడీని అంతమొందించాలి

వ్యవస్థలో మార్పుతోనే అది సాధ్యం

మేడే వేడుకల్లో మంత్రి సీతక్క



ములుగులో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి, నినదిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మే 1: శ్రమదోపిడీని అంతమొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. వ్యవస్థలో మార్పుతోనే అది సాధ్యమని వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మేడే వేడుకలకు మంత్రి హాజరయ్యారు. అరుణ పతాకాన్ని (ఎర్రజెండా) ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రమ లేకుండా మానవుడు లేడన్నారు. శ్రమైక జీవనసౌందర్యానికి సమానమన్నది లేనేలేదని, ఒక మనిషి శ్రమను మరో మనిషి దోచుకోవడం ప్రారంభమైందని అన్నారు. శ్రమతో సృష్టించబడిన సంపద పరాయీకరణ చెంది ఎలాంటి శ్రమ చేయని కొద్దిమంది చేతుల్లోకి వెళ్తోందని అన్నారు. దోపిడీ అంతం కావాలంటే వ్యవస్థ మారడం తప్ప వేరే మార్గంలేదన్నారు., దోపిడీ రహిత సమాజం కోసం ఎర్రజెండాను ఎత్తిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, కాంగ్రెస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేసవిలోనూ నిరంతర విద్యుత్ సరఫరా

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ జీఎం బీకంసింగ్


గుడాడ్‌పల్లిలో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం బీకంసింగ్

భూపాలపల్లిటౌన్, మే 1: వేసవిలో సైతం నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ జనరల్ మేనేజర్ (కమర్షియల్) బీకంసింగ్ అన్నారు. భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లిలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. నేరేడుపల్లిలో పాడైపోయిన బ్రేకర్‌ను త్వరగా బాగుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు ముమ్మరం చేస్తున్నామని అన్నారు. భూపాలపల్లి, చిట్యాల మండలాల్లోని కొంపల్లి, గుడాడ్‌పల్లి, దూత్‌పల్లి, ఎస్‌ఎం కొత్తపల్లి, నేరేడుపల్లి వ్యవసాయ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం కోసం ఆ ప్రాంతంలో వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడానికి 811 స్తంభాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 415 స్తంభాలు పాడైపోగా వాటిని మార్చామన్నారు. నేలకొరిగిన 431 స్తంభాలను సరిచేసినట్లు తెలిపారు. లోడ్ ఎక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై అదనంగా 63 కేవీఏ, రెండు 100 కేవీఏ, 31 25 కేవీఏలను అమర్చామన్నారు. దీంతో ఓవర్‌లోడ్ సమస్య తీరుతుందని తెలిపారు. ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా కొత్తగా 33/11కేవీ వజినపల్లి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. విద్యుత్ లైన్లలో కంట్రోల్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, తద్వారా విద్యుత్ లైన్లలో ఏమైనా సమస్య తలెత్తితే త్వరగా దానిని సవరించడానికి వీలుంటుందని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జయశంకర్ భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్ నాయక్, డీఈ నాగరాజు, ఎస్ఏఓఎల్ దేవిదాస్, ఏడీఈ శ్రీనివాసుల యాదవ్, బి.సందీప్‌పటేల్, ఏఈలు రమేష్, విశ్వాస్‌రెడ్డి, సబ్ ఇంజనీర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

అరూరికి ఓటమి భయం పట్టుకుంది..

- అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు..
- ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యలు


7లో


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి, పక్కన కావ్య, ఎమ్మెల్యే నాగరాజు

లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- ఏనుగల్లు, పర్వతగిరిలో కార్నర్ మీటింగ్‌లు

7లో


పర్వతగిరి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అరూరి రమేష్

దేవుడిపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు..

- ఇదే సీఎం రేవంత్‌రెడ్డి పనితీరు
- అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వర్ధన్నపేట మండలంలోని సుధీర్‌కుమార్‌తో కలిసి ప్రచారం

వర్ధన్నపేట రూరల్, మే 1: దేవుడిపై ఒట్టు వేసి కేసీఆర్‌ను తిట్టడమే సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం పనిగా పెట్టుకున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. బుధవారం వర్ధన్నపేట మండలంలోని చెన్నారం, నల్లబెల్లి, ఉప్పరపెల్లి, రాంధాన్ తండా, కట్ర్యాల, ఇల్లంద, బండౌతపురం, దమ్మన్నపేట, రామవరం, కొత్తపెల్లి గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమం కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తోందని ఆరోపించారు. చల్లగా ముందుకు పోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒక ఉద్యమకారుడికి.. ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవని గుర్తుచేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, అందుకే పార్లమెంటులో బీఆర్ఎస్ గళం వినిపించడానికి గులాబీ దళం ఉండాలన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ, రుణమాఫీ, రైతు బంధు, మహిళలకు రూ.2500 వచ్చాయా.. అంటూ ప్రశ్నించారు. మార్పు కావాలని కోరుతున్న ప్రజలకు మార్పు రాలేదని, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకు ఓటు వేయాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేష్ సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు.


చెన్నారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మొద్దు.. - సుధీర్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని వరంగల్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారుడినైన తనను కేసీఆర్ పిలిచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు. కడియం శ్రీహరి, అరూరి రమేష్, పసునూరి దయాకర్‌లు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని గుర్తుచేశారు. వీరిని పదేండ్ల పాటు అందలం ఎక్కించి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించేలా చేస్తే తమ స్వార్థ రాజకీయాల కోసం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆగం చేశారని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించేలా గులాబీ సైనికులు పనిచేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ సోమలక్ష్మి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దమ్మన్నపేటలో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్, పక్కన ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్‌తోనే మహిళలకు సంక్షేమ పథకాలు

ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్

చెన్నారావుపేట (వరంగల్ జిల్లా), మే 1 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తేనే.. నిరుపేద మహిళలకు సంక్షేమ పథకాలు అందుతాయని మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ అధ్యక్షతన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావటం ఖాయమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాగానే నిరుపేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష అందిస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఐదు గ్యారెంటీ పథకాలను అందిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు న్యాయం చేస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం గత 10 సంవత్సరాల్లో పేదలకు చేసిందేమి లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠంను చెప్పాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. ఉపాధిహామీ పథకంలో రోజుకు ప్రతీ కూలీకి రూ.400లను అందిస్తామన్నారు. కార్యకర్తలు బలరాంనాయక్‌ను 70వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అనిల్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి తక్కళ్లపెల్లి రవిందర్‌రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పాల్వాయి శ్రీనువాస్, పెండం రామానంద్, దేవేందర్‌రావు, మోహన్‌లాల్. సంగులాల్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, నర్సంపేట మండల ఉపాధ్యక్షుడు గజ్జి రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

‘పాంచ్ న్యాయ్’ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాంగ్రెస్ నేత, సినీ నిర్మాత బండ్ల గణేష్


సమావేశంలో మాట్లాడుతున్న బండ్ల గణేష్

వివరాలు 8వ పేజీలో...

నా చావుకు సీఐ, ఎస్ఐ కారణం



● సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన వ్యక్తి

● నా భర్తను కాపాడండి : బాధితుడి భార్య

వరంగల్ క్రైం, మే1: తన చావుకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ సీఐ జె.సురేష్, ఎస్ఐ ఎం.సురేష్‌తోపాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లు కారణమని ఆరోపిస్తూ వంగపహాడ్ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమవడం కలకలం రేపింది. గ్రామంలో తనకు వీరేశం అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాని పేర్కొంటూ ప్రశాంత్ మంగళవారం అదృశ్యమయ్యాడు. అయితే తన భర్తను కాపాడి పోలీసులపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ బాధితుడి భార్య మాధవి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. సహాయం కోసం వెళితే హసన్‌పర్తి సీఐ, ఎస్ఐలు కొట్టడం వల్లనే అవమానం భరించలేక తన భర్త సూసైడ్ నోట్ రాసి ఎటో వెళ్లిపోయాడని ఆమె విలపించారు. తన భర్తకు ఏదైనా జరిగితే దానికి సీఐ, ఎస్ఐ బాధ్యత వహించాలని ఆమె తెలిపారు. కాగా, డయల్ 100ను దుర్వినియోగం చేశాడని సోమవారం హసన్‌పర్తి పోలీసులు ప్రశాంత్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు సాయంత్రం నుంచి ప్రశాంత్ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమాజ సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలి

సుబేదారి, మే 1: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచనలు చేపట్టాలని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి వ్యవసాయ, విద్య, వైద్య సామాజిక రంగాలపై రాసిన వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాల సంపుటి పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాల అధ్యాపకులకు సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, సీనియర్ అధ్యాపకులు అంజనారావు, డాక్టర్లు కరుణాకర్, శ్రీధర్‌కుమార్, శేషు, శ్రీలత, మాధవి, రాంబాబు, సుచరిత, నాగయ్య, భిక్షపతితోపాటు రచయిత ఆదిరెడ్డి పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన వారికి మోషన్ కళాశాలలో ఉచిత విద్య

వరంగల్ ఎడ్యుకేషన్, మే 1: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు హనుమకొండ నయీంనగర్‌లోని రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాలలో రెండేళ్ల ఫ్రీ ఎడ్యుకేషన్ అందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఐఐటీ, నీట్‌లకు విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌తో పాటు కళాశాల ఫీజులో 50 శాతం రాయితీని ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటీ, మెడికల్‌లో సీట్లు సాధించడమే లక్ష్యంగా నెలకొల్పిన రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రతిభ కలిగిన ఉత్తమ విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మిగతా అన్ని వివరాలకు నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళ ఖాతా నుంచి డబ్బులు మాయం

హనుమకొండ టౌన్, మే1: మహిళ బ్యాంక్ ఖాతా నుంచి ఆమెకు తెలియకుండానే వేరే ఖాతాలోకి డబ్బులు బదిలీ అయ్యాయి. హనుమకొండ కిషన్‌పురలో నివాసం ఉంటున్న రజిని అనే మహిళ ఏప్రిల్ 26న ఉదయం బ్యాలెన్స్ చెక్ చేసుకోగా రూ.30,000 డ్రా చేసినట్లుగా చూపించింది. వెంటనే సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా సత్యం ఎంటర్‌ప్రైజెస్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లుగా సమాచారం ఇచ్చాడు. కాగా, బాధితురాలు బుధవారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొనారు.

కాజీపేటలో పోలీసుల తనిఖీలో రూ.3.41 లక్షలు పట్టివేత

కాజీపేట, మే 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల వాహనాలు తనిఖీ చేస్తుండగా తనిఖీలలో ఇద్దరు వ్యక్తులు సరైనపత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట డీజిల్‌కాలనీ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్కాకుల సురేశ్ సరియైన పత్రాలు లేకుండా బైక్‌లో రూ.2,71,060 తరిలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇదే చెక్‌పోస్ట్ వద్ద వరంగల్‌కు చెందిన మిట్టపల్లి రాకేశ్, సరైన పత్రాలు లేకుండా తన బైక్‌లో రూ.70వేల 800 తరలిస్తుండగా పట్టుపడ్డారు. నగదు స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అరూరికి ఓటమి భయం

అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు ● ఎర్రబెల్లి, అరూరిని మడతబెట్టిన నియోజకవర్గాల ప్రజలు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వర్ధన్నపేట రూరల్, మే 1 : వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని ఏబీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బూత్ కమిటీలే పార్టీకి పునాదులని, రానున్న రోజుల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. బీజేపీతో పదేండ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్ని రంగాల్లో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. కడియం కావ్య నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి గ్రామంలోనే పుట్టి పెరిగిందని, చదువుకుని మళ్లీ వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యురాలిగా పనిచేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన కావ్యను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.

పార్లమెంటు అభివృద్ధిని మరిచి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న అరూరికి ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. వంద శాతం కడియం కావ్య లోకలేనని స్పష్టం చేశారు. రైతుల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వాళ్లతో కలిసి ఫెన్సింగ్‌లు వేసిన ఘనత రమేష్‌దని గుర్తు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అరూరి రమేష్ మండలానికో గెస్ట్ హౌస్ నిర్మించుకున్నాడని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావును, వర్ధన్నపేటలో అరూరి రమేష్‌ను ప్రజలు మడతపెట్టి కొడితే దిమ్మ తిరిగి పోయిందని ఎద్దేవా చేశారు. మనుమరాలు వయసున్న అమ్మాయి చేతిలో ఓడిపోయిన ఎర్రబెల్లి ఇంకా సిగ్గులేకుండా నియోజకవర్గంలో తిరుగుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన మేనిఫెస్టోను తీసుకువచ్చిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద మహిళలకు రూ.లక్ష అందించడం ఖాయమన్నారు. కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అరూరి అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు : కడియం కావ్య

వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉండి అరూరి రమేష్ చేసిన అకృత్యాలు అన్నీ ఇన్నీ కావని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. అరూరి రమేష్ చేసిన అవినీతి, అక్రమాలు, అకృత్యాలు, భూకబ్జాలు ప్రజలందరికీ తెలుసని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్న రమేష్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ రైతుల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. బీజేపీకి ధన బలముంటే, కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం ఉందన్నారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే అరూరి రమేష్ బీజేపీ పంచన చేరాడని తెలిపారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నా, ఏనాడూ ఎమ్మెల్యేగా ఉండి పట్టించుకోలేదని ఆరోపించారు. కరోనా క్లిష్టకాలంలో సైతం ఇక్కడి ప్రజలకు తాను సేవ చేశానని, మీరు ఆశీర్వదిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు.

అనంతరం వర్ధన్నపేట పట్టణానికి చెందిన వంద మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నేత కత్తి వెంకటస్వామి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి కడియం కావ్య, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కావ్యకు పలువురి మద్దతు

హనుమకొండ సిటీ/వడ్డేపల్లి: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యకు తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అఖిల్ పాషా మద్దతు తెలియచేశారు. బుధవారం హనుమకొండలోని కడియం కావ్య నివాసంలో సమాఖ్య ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మజహర్ హుస్సేన్, మహ్మద్ అబిద్ నవాజ్, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అలాగే కడియం కావ్యకు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర కన్వీనర్ నల్లాల కనకరాజు, వైస్ చైర్మన్లు అనిల్, నాను మాట్లాడారు. ఈ సమావేశంలో జంగం బాబురావు, రాజకొమురయ్య, ఐలయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, కడియం శ్రీహరి

జేఎన్‌ఎస్‌లో కావ్య ఎన్నికల ప్రచారం

హనుమకొండ చౌరస్తా, మే 1: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలసి హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మార్నింగ్ వాకింగ్ పాల్గొని వాకర్స్‌ను కలసి ముచ్చటిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి మారు పేరు అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన అందుబాటులోకి వచ్చిందని కొనియాడారు. కేంద్రంలో రాహుల్ గాంధీ సారథ్యంలో దేశ ప్రజలకు మంచి పాలన అందనుందని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని వాకర్స్‌ను కోరారు. ప్రచారంలో భాగంగా సరదాగా క్రీడాకారులతో కలిసి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడి ఆకట్టుకున్నారు. అంతకుముందు బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో కావ్య పాల్గొని కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ మేరకు మార్కెట్‌లో ఉన్న వ్యాపారులు కావ్యకు మద్దతూ ప్రకటిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కిరిబిక్కిరి

ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం విలవిల

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) / ములుగు/ భూపాలపల్లి టౌన్/ జనగామ కల్చరల్ / మహబూబాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) :ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఎండతీవ్రతకు తోడు వడగాలులు, ఉక్కపోతకు జనం విలవిలలాడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 45.6 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం ములుగు జిల్లాలో అత్యధికంగా 45.6 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదవగా వరంగల్‌లో 45.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.3 డిగ్రీలు, జనగామలో 45.3 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 45.1 డిగ్రీలు, హనుమకొండలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవగా వీటిలో అయిదు జిల్లాలు ఉమ్మడి వరంగల్ పరిధిలోనే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా.. ఈ అయిదు జిల్లాలు ఆ జాబితాలో ఉన్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 45డిగ్రీలు దాటి ఎండల తీవ్రత ఉండడం వందేళ్లలో ఇదే మొదటి సారి అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. 1921లో ఈ స్థాయిలో ఎండలు రికార్డు అయ్యాయని, ఆ తర్వాత ఏప్రిల్ నెలలో 45 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవలేదని, సాధారణంగా ఏప్రిల్‌లో 40 నుంచి 41డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయని, ఈ సారి మాత్రం ఇందుకు భిన్నంగా ఏప్రిల్ మొదటి వారం నుంచె ఎండలు 41 డిగ్రీలు దాటాయని చెబుతున్నారు.

ఉడికిపోతున్న ఏజెన్సీ మండలాలు

వేసవి తీవ్రతతో ములుగు జిల్లాలోని ఏజెన్సీ మండలాలు ఉడికిపోతున్నాయి. కొద్దిరోజులుగా 45డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా బుధవారం ఏకంగా 46డిగ్రీలు దాటింది. మంగపేట మండలం మల్లూరులో 46.5, వెంకటాపురం(నూగూరు) మండలం ఆలుబాకలో 46డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే తాడ్వాయి మండలం మేడారంలో 44.4, వాజేడు మండలం ధర్మవరంలో 44.3, వెంకటాపూర్(రామప్ప)లో 44.2, ములుగు మండలం ఖాసిందేవిపేటలో 44, ఏటూరునాగారంలో 43.8, గోవిందరావుపేటలో 43.5, కన్నాయిగూడెంలో 42.3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆరంజ్ జోన్ నుంచి రెడ్ జోన్‌లోకి వచ్చింది. నిన్న మొన్నటి వరకు 43 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న మండలాల్లో బుధవారం 45 డిగ్రీలు దాటింది. చిట్యాల మండల కేంద్రంలో 45.5డిగ్రీలు, మల్హర్ మండలంలోని తాడిచర్లలో 45.3, రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో 45.3, అలాగే గణపురంలోని ... రులో 45.1 డిగ్రీలు, మొగుళ్లపల్లిలో 44.8 డిగ్రీలు నమోదవగా మిగిలిన మండలాల్లోనూ 45 నుంచి 42డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు జనగామ కూడా రెడ్‌జోన్‌లోకి వెళ్లింది. బుధవారం గరిష్ఠంగా 45.6డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదైంది. చిలుపూర్, జఫర్‌గడ్ మండలాల్లో 45.6, జనగామలో 45.0 డిగ్రీలు నమోదైంది.



మండే ఎండ.. పచ్చి గడ్డే అండ

ఎండలు మండుతున్నాయి... రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఇక ఇళ్లలో ఉండే వారు ఉక్కపోతకు అల్లాడుతున్నారు. ముఖ్యంగా రేకుల ఇళ్లలో నివాసం ఉండే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ క్రమంలో హనుమకొండ న్యూశాయంపేట వద్ద రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న ఓ కుటుంబం భానుడి ప్రతాపం నుంచి కొంత ఉపశమనం పొందేందుకు ఇలా వారు నివాసం ఉంటున్న రేకుల కప్పుపై పచ్చని జమ్మి గడ్డిని వేసుకున్నారు.

ఫోటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

వడదెబ్బతో ముగ్గురి మృతి

వడదెబ్బ బారిన పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేరుగు నారాయణ (75) ఎండతీవ్రత, వడగాలుకు అనారోగ్యం పాలై.. బుధవారం వ్యపరిస్థితి విషమించి ఇంటివద్దే మృతిచెందాడు. జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డకు చెందిన మహ్మద్ మొయినొద్దీన్ (52) అనే కూలీ రోజూలాగే బుధవారం కూడా పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అలాగే కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెం దిన పత్తిపాక రమేష్(48) అనే చిరువ్యాపారి రోజూలాగే దుస్తులు అమ్మి మంగళవారం అస్వస్థతకు గురవగా ఆసుపత్రికి తరలించారు. కానీ ఆయన అప్పటికే మృతిచెందాడు.

లోక్‌సభ ఎన్నికల్లో ఆశీర్వదించండి..

- దళితులను ముట్టుకోని వ్యక్తి కడియం కావ్య
- పదవులు అనుభవించి కేసీఆర్‌కు కడియం వెన్నుపోటు
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- ఏనుగల్లు, పర్వతగిరిలో కార్నర్ మీటింగ్‌లు

పర్వతగిరి, మే 1: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని ఏనుగల్లు, పర్వతగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. జై బీజేపీ.. జై అరూరి.. నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ప్రస్తుతం మీ ఇంటి బిడ్డగా పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించాలని కోరారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై తాను బీజేపీలో చేరారని, తనతో పాటు అనేక మంది మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించడానికి ఎన్ని కుట్రలు చేశారో ప్రజలకు తెలుసని, ప్రస్తుతం ఆ కుట్రలను పటాపంచలు చేయాలన్నారు. తనను ఓడించడం కోసం కడియం శ్రీహరి అనేక ప్రయత్నాలు చేశాడని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు కన్నీళ్లు మిగిల్చాయన్నారు. హామీలు అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, కాంగ్రెస్ పార్టీ నేతలు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లడుగుతారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు రేవంత్‌రెడ్డి ఎందుకు టికెట్ ఇచ్చాడో కాంగ్రెస్ నేతలు ఆలోచన చేయాలని అరూరి రమేష్ కోరారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ దళితులు లేరా అని ప్రశ్నించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ పార్టీ నేతల మీద లేని స్కాంలు లేవన్నారు. వర్ధన్నపేట ఆస్పత్రిలో కడియం కావ్య డాక్టర్‌గా పని చేసిందని, ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన దళితులను కనీసం ముట్టుకుని వైద్యం చేయలేదని విమర్శించారు. ఊసరవెల్లిలాగా రంగులు మార్చే వ్యక్తి కడియం శ్రీహరి అని, పదవులు అనుభవించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్‌తో పాటు తనను సైతం బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లగొట్టింది కడియం శ్రీహరి అని ఆరోపించారు. పదేళ్లు వర్ధన్నపేటకు ఎమ్మెల్యేగా ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, అవి మీ కళ్ల ముందే ఉన్నాయని తెలిపారు. మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి చేసే బీజేపీకే ఓటు వేసి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మే 13వ తేదీన అందరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు బీజేపీ ఇన్‌చార్జ్ ఎర్ర బెల్లి ప్రదీప్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, జిల్లా నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, బన్న ప్రభాకర్, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు ఏకాంతం గౌడ్, నరేందర్ వర్మ, రంగు కుమార్ గౌడ్, రంగు రజిత, లక్ష్మీనారాయణ, బొట్ల మధు తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరిలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న అరూరి రమేష్



ఏనుగల్లులో ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 1 : మాదిగలకు ద్రోహం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు మాదిగలు, మాదిగ ఉపకులాలు ఓటు వేసి గెలిపించాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగల అండతో రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి.. మాదిగలను రాజకీయంగా అణగదొక్కుతూ వారి రాజకీయ భవిష్యత్తును సమాధి చేస్తున్నాడని అన్నారు. కడియంకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే మాదిగలకు, మాదిగ ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ గెలిస్తే మాదిగల అనేక ఏళ్ల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ ఏలియా, నాయకులు గాదె శ్రీధర్, రడపాక అదాం, గాదెపాక మహేందర్, గంగాదర్, రవీందర్, గాదె కుమార్, మేడ యాకస్వామి, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



భూపాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

కాకతీయఖని, మే 1: ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) భూపాలపల్లిలో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనులు, ఆయా డిపార్ట్‌మెంట్ల వద్ద జరిగిన వేడుకల్లో కార్మికులు పాల్గొన్నారు. సందర్భంగా ఎర్రజెండాను ఆవిష్కరించారు. మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొమరయ్య భవన్‌లో సీపీఐ నాయకులు జెండా ఆవిష్కరించారు. అలాగే పట్టణంలోని బాతాల రాజు భవన్‌లో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు వేడుకలను నిర్వహించారు. టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ కార్యాలయాల్లో మేడే ఘనంగా జరిగింది.

● కన్నాయిగూడెం: మండలంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. సీఐటీయూ మండల అధ్యక్షుడు కావేరి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొచ్చు సంజీవ, సీఐటీయూ నాయకులు పాషా, రాజ్యలక్ష్మి, శ్రీలత, తులసి, సదానందం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు..

● మహాముత్తారం: మండల కేంద్రంలో సీఐయూటీ ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఠం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం: మండలంలో సీఐటీయూ, సీపీఎం, భవన నిర్మాణ, ఎలక్ట్రీషియన్, ఆటో, పెయింటింగ్ కార్మికులు, ఆశా యూనియన్లు, హమాలీ సంఘాల ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్, మండల అధ్యక్షుడు బాలోజి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిటమట రమేష్, నాయకులు ఎమ్డీ. సులేమాన్, జి. సత్యం, ఎన్. నారాయణ, ఇ. కిరణ్, అరుణ, కాలిక, నాగదేవి, గంగాధర్ పాల్గొన్నారు.

● కాటారం: భవన నిర్మాణ, హమాలీ, పంచాయతీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా సంఘాల మండల అధ్యక్షులు పసుల మొగిలి, మల్లయ్య, దోమల శ్రీనివాస్ జెండాలు ఎగరేశారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చీమల సందీప్, కాటారం మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, కొట్టె శ్రీహరి, చీమల రాజు, కొట్టె ప్రభాకర్, మంత్రి రాజయ్య, లింగయ్య, శ్రీనివాస్, రవి శ్రీకాంత్, కార్మిక సంఘాల జిల్లా, మండల నాయకులు పసుల మొగిళి, గొరేజు పెద్ద రామన్న, చిన్నరామన్న, రాజయ్య, గోనె రవి, సెగ్గం మల్లయ్య, పోచయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపల్లిగోరి: మండల కేంద్రంలో మేడే వేడుకలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భవన నిర్మాణ కార్మికుల మండల కార్యదర్శి పసుల రాకేష్, నంది సదానందం, మోహన్‌రావు, నిమ్మల రాజు, బమ్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, కొయ్యూర్, ఇప్పలపల్లితో పాటు పలు గ్రామాల్లో బుధవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే సందర్భంగా జెండాను ఏగిరేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అక్కల బాపు, మల్లయ్య, సురేష్, పన్నాల కుమారస్వామి, శంకర్, మహేందర్, మల్లయ్య, రాజసమ్మయ్య, కేదారి, శ్రీను, సుమన్ పాల్గొన్నారు.

● టేకుమట్ల: తాపీ మేస్త్రీ, హమాలీ, తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలో మేడే వేడుకలు జరుపుకున్నారు. ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తాపీమేస్త్రీల సంఘం టౌన్ అధ్యక్షుడు సురేష్, మండల అధ్యక్షుడు రాం చందర్, గౌరవ అధ్యక్షుడు స్వామి, వివిధ పార్టీల నాయకులు గునిగంటి మహేందర్, ఆది రఘు, కోటగిరి సతీష్, పోతనేవేని ఐలయ్య, కట్ల శ్రీనివాస్, హమాలీ సంఘం మండల అధ్యక్షుడు మచ్చ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం(నూగూరు): మండలంలో మేడే వేడుకలు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, సీపీఎం మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను వేర్వేరుగా హాజరై ఎర్రజెండాను ఆవిష్కరించారు. సీపీఎం, సీపీఐ నాయకులు కట్ల నర్సింహాచారి, గ్యానం వాసు, రాములు, తోట నాగేశ్వర్‌రావు, చిట్టెం ఆదినారాయణ, కట్ల రాజు, ఆదినారాయణ, కొండయ్య, శ్రీను, నాగూర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట: మండలంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఎం అనుబంధ సంఘాలతోపాటు వివిద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పిండిగ నాగరాజు, చిన్నా, ఎల్బీ. మత్యాలు, నర్రా శివప్రసాద్, ఒంగేటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● వాజేడు: మండలంలో మే డే వేడుకలను సీపీఎం శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మండల కేంద్రంతో పాటు జగన్నాథపురం, ఘనపురం, చెరుకూరు, ధర్మవరం, పేరూరు, కృష్ణాపురం, గుమ్మడిదొడ్డి, ప్రగళ్లపల్లి, పూసూరు, మండపాక, కొంగాల, మురుమూరు, ఏడ్జర్లపల్లి, గుడిసెల పోరాట కేంద్రం వద్ద నాయకులు ఎర్రజెండాను ఎగురవేసి ప్రపంచ కార్మిక దినోత్సవంను జరుపుకున్నారు.సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు దామోదర్, దేవయ్య, కృష్ణబాబు, సౌమ్య, పూనెం కృష్ణబాబు, సంతోష్, రమాదేవి, బద్ది ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

● గణపురం: మండలంలో మేడేను ఘనంగా నిర్వహించారు. కేటీపీపీలో ఎస్సీ, ఎస్టీ, ఐఎన్‌టీయూసీ, 1104, బీసీ వెల్ఫేర్ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

● ములుగు కలెక్టరేట్: ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు ములుగు జిల్లాకేంద్రంతోపాటు కాసిందేవిపేట, జంగాలపల్లి, మల్లంపల్లి, అబ్బాపురం, పొట్లాపూర్, పత్తిపల్లి, కన్నాయిగూడెం, రాయినిగూడెం, లాలాయిగూడెం, జగ్గన్నగూడెం గ్రామాల్లో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎమ్డీ.అమ్జద్‌పాషాపాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు ఇంజం కొమురయ్య, బోడ రమేష్, బల్గూరి చందర్, మామిడి నటరాజ్, భూక్య పరంసింగ్, సాంబు, స్వామి తదితరులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్మికశాఖ ఆధ్వర్యంలో ములుగు మండలం బండారుపల్లి గ్రామంలోపి జేహెచ్ఎస్ ఇటుకబట్టీలో పనిచేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించారు. ములుగు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్ ఈసందర్భంగా కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, బార్ అసోసియేషన్ సభ్యులు బాలుగు చంద్రయ్య, కె.సునీల్‌కుమార్, రాచర్ల రాజ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

● చిట్యాల: ఏఐటీయూసీ, సీఐటీయూ, హమాలీ సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. బండారి మధుకర్, ఆరెపల్లి ఎల్లయ్య, ముత్యాల నర్సయ్య, పుల్ల మల్లయ్య, కట్కూరి కుమారస్వామి సృజన్‌కుమార్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● తాడ్వాయి: తాడ్వాయి, కాటాపూర్, బీరెల్లి, గంగారం, తదితర గ్రామాల్లో సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, తదితర సంఘాల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, వ్యవసాయ, ఉద్యోగ సంఘాల మేడేను నిర్వహించారు. దుగ్గి చిరంజీవి, దాసరి కృష్ణ, బండారి శ్రీను, పులి నర్సయ్య, సమ్మక్క, జమునారాణి, జయసుధ, గడ్డం రంజిత్, రోహిత్, బాబూరావు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి


కొండాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

గణపురం, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ ఎస్‌ను గెలిపించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. మండలంలోని సీతారాంపురం, నగరంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా సుధీర్ కుమార్‌కు ఓట్లు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామాల్లో ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారంపై చర్చించారు. నగరంపల్లిలో ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రాహుల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పూర్ణచందర్‌రెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, చెల్పూరు మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, శ్రీనివాస్, దేవేందర్‌రావు, ఉడుత సాంబయ్య, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

మహాముత్తారం, మే1: మండలంలోని రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. 22 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని 6,600 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశామని, ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై మహేందర్ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

వాజేడు: గుడుంబాను తరలిస్తున్న వ్యక్తి పోలీసులకు పట్టుబడిన సంఘటన మండలంలోని పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రుపట్ల క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జరిగింది. ఎస్సై జి.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పోలీస్ సిబ్బందితో కలిసి 163వ జాతీయ రహదారిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వెంకటాపురం మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన తాటి రాజు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా అతడిని పరిశీలించారు. అతడి వద్ద ఉన్న రెండు సంచుల నుంచి సుమారు 120 లీటర్ల గుడుంబా లభ్యమైంది. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

టీఏడీయూ రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా సర్వేశ్వరరావు



వాజేడు, మే 1: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శిగా మండలంలోని పూసూరుకు చెందిన నల్లెబోయిన సర్వేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్ బుధవారం ప్రకటించారు. అదే విధంగా సంఘం జిల్లా కార్యదర్శిగా జగన్నాథపురానికి చెందిన లేగల ప్రవీణ్‌ను, కార్యవర్గ సభ్యుడిగా తిప్పనపల్లి రామును నియమించారు. ఎంపికైన వీరికి వాజేడు ఆటోయూనియన్ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు వేములవాడ రత్నప్రసాద్, కుమ్మరి మల్లయ్య, ఎట్టి రామారావు, బొల్లె తిలక్, కుప్ప రాకేష్, కొప్పుల ప్రశాంత్, జ్యోతిబాబు, సమ్మాలు, బద్ది నరసింహారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'లో అవకతవకలపై ఫిర్యాదు

చిట్యాల, మే 1: ఉపాధిహామీ పథకంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని మండలంలోని నవాబుపేట గ్రామస్థులు ఎంపీడీవో జయశ్రీకి బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో స్థానికంగా లేనివారికి, ఉపాధిహామీ పనులకు హాజరుకాని పలువురి ఖాతాలో కూలి డబ్బులు జమ అయ్యాయని వివరించారు. తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే..

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మే 1: దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని, దీంతో రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఇంచర్ల, జంగాలపల్లి, జగ్గన్నపేట, మల్లంపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లిలో మంత్రి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు పని కల్పించినట్లు తెలిపారు. ఈసారి మళ్లీ అధికారంలోకి రాగానే ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.400 ఇస్తామని హామీ ఇచ్చారు.కేంద్రంలో అధికారంలోకి రాలేమని తెలిసిన బీజేపీ ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతూ జైల్లో పెడుతోందని విమర్శించారు. జీఎస్టీ తీసుకొచ్చి రూ.54లక్షల కోట్లను పేదల నుంచి వసూలు చేసిందని ఆరోపించారు. ప్రతి ఏడాది 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎన్ని ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాల్సిన అసవరం ఎంతైనా ఉందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

కన్నాయిగూడెం: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్కజొన్న పంట

కొత్తపల్లిగోరి, మే 1 : మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో బుధవారం మొక్క జొన్న పంట దగ్ధమైంది. దీంతో రైతులు కావడి కుమార స్వామి, గుజ్జుల కుమారస్వామికి తీవ్రంగా నష్టపోయారు. బాధితులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా ఫైరింజన్ వచ్చేలోగానే రెండెకరాల పంట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లింది.

గర్మిళ్లపల్లిలో గడ్డివాములు..

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో బుధవారం ఆ గ్రామానికి చెందిన శ్యామల లింగారెడ్డి, నల్లబెల్లి జయపాల్‌కు చెందిన దగ్ధమయ్యాయి. ఈదురు గాలులతో విద్యుత్ తీగలు ఒక్కదానికొక్కటి తాకి మంటలు చెలరేగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

మోసపూరిత హామీలతో
గద్దెనెక్కిన కాంగ్రెస్

● బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


కార్నర్ మీటింగులో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కాటారం, మే 1: రాష్ట్రంలో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కి పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. కేసీఆర్ నేతృత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పలు పథకాలను అమలు చేసి అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలిచిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాటారంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాలుగు నెలల నుంచి ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఏవేవో మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ అంటూ ఒట్లు పెట్టుకోవడం హాస్యాస్పద మన్నారు. వృద్ధులు, వికలాం గులకు పెన్షన్ పెంపు, నిరుద్యోగులకు జీవనభృతిపై బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఓట్లకు వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీలకు భయం పట్టుకుందన్నారు. ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక యాత్రను 48గంటలు నిలిచేలా చేశారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో నమ్మకం పోయిందని బీఆర్ ఎస్‌ను ఓడించామని బాధపడుతున్నారని, కేసీఆర్‌కు బలం చేకూర్చేలా ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని అన్నారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ ఈ ప్రాంత ఎమ్మెల్యే అభివృద్ధిపై శ్రద్ధ వహించి ఐటీ పరిశ్రమను తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు తోట జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి, జక్కు రాకేష్, రత్న సౌజన్య, రామిళ్ల కిరణ్, జోడు శ్రీనివాస్, ఉప్పు సంతోష్, వంశీ, నరివెద్ది శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, రాజమణి, రజని పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో ఎన్నికల అబ్జర్వర్ పూజలు

మహదేవపూర్, మే 1 : శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో బుధవారం పెద్దపల్లి ఎలక్షన్స్ అబ్జర్వర్ రవీష్ గుప్తా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు రవీష్‌గుప్తాను పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి ఆలయానికి ఆహ్వానించారు. ఆలయంలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో దర్శనం అనంతరం స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ తహశీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, మహదేవపూర్ సీఐ రాజేశ్వర్ రావు, కాళేశ్వరం ఎస్సై భవాని, సేన్, ఆలయ సూపరిం టెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

ఇదేం ట్రీట్‌మెంట్..?


సెల్‌ఫోను వెలుతురులో ఇంజెక్షన్ వేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

వాజేడు, మే 1: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగుల పట్ల నిర్లక్ష్యం రోజు రోజుకూ పెరిగిపోతోంది. విద్యుత్ సౌకర్యం ఉన్నప్ప టికీ సెల్‌ఫోన్ వెలుతురుతో చికిత్సలు చేస్తున్నారు. కరెంటును వినియో గించకుండా నిర్లక్ష్యం చేస్తు న్నారు. బుధ వారం ఈ దృశ్యం కనిపించిదింది. వార్డు రూంలో లైట్లు కొన్ని రోజులుగా వెలగక పోవడంతో సెల్‌ఫోను వెలుతురు సాయంతో చికిత్సలు నిర్వహిస్తున్నారు. వైద్యసిబ్బందికి కనీసం విద్యుత్‌లైట్లు అమర్చే తీరిక లేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. అంతేకా కుండా ఆస్పత్రికి రోగులకు ఇన్‌జె క్షన్లు వేసేం దుకు సిబ్బంది అందుబా టులో లేరు. దీంతో ల్యాబ్ టెక్నీషియన్ ఇన్‌జెక్షన్ వేయడం విస్మయానికి గురి చేసింది. ఇదిలా ఉండగా అందుబాటులో ముగ్గురు డాక్టర్లు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు కూడా సమయానికి రారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి ఎదురు చూస్తే 11 గంటలకు గానీ ఓపీ చూడటం లేదని అంటున్నారు. ఓ వైపు మండుతున్న ఎండలకు ప్రజలు అల్లాడుతూ రోగాల పాలవుతుంటే అందుబాటులో ఉండి చికిత్సలు అందించాల్సిన వైద్యాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రిలో సిబ్బంది కొరత కూడా ఉండటంతో ల్యాబ్‌టెక్నీషియన్లు, ఏఎన్ఎంలతో చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

కేసీఆర్‌ను కలిసిన
బీఆర్ఎస్ నాయకులు


కేసీఆర్‌తో వాజేడు బీఆర్ఎస్ నేతలు

వాజేడు, మే 1: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆ పార్టీ వాజేడు నాయకులు బుధవారం కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి మాలోత్ కవిత తరఫున కేసీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో వాజేడు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమళ్ల రామకృష్ణారెడ్డి ఆయన్ను సింగరేణి గెస్ట్‌హౌస్‌లో కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యలపై కేసీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. రామకృష్ణారెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు గారా నాగార్జునరావు, సుగంధపు సాంబశివరావు, వీవీఎస్ఎన్ వర్మ, సోమిడి నరసింహారావు, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మే 1: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌ను ఎలాంటి పొరబాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పోలింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో సమస్యలు ఎదురైతే అనుసరించాల్సిన విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల నిర్వమణ అధికారులు శామ్యూల్, అవినాష్, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

'పాంచ్ న్యాయ్' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● కాంగ్రెస్ నేత, ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్

కాటారం, మే 1: కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ ప్రకటించిన పాంచ్ న్యాయ్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నేత, ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ అన్నారు. కేంద్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మండలంలోని ధన్వాడలో బుధవారం రాత్రి సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవపూర్, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు, కాంగ్రెస్ నేత దుద్దిళ్ల శ్రీనుబాబుతో కలిసి హాజరయ్యారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కేంద్రంలో అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. శ్రీనుబాబు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మహిళా నేతలు సుగుణ, మహేశ్వరి, విజయారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, పార్టీ నాయకులు వంశవర్ధన్‌రావు, దేవేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ కూలీలకు విద్యుత్ షాక్

ట్రాక్టర్‌పై తిరిగి వస్తుండగా ఘటన

కిందికి దూకడంతో ఐదుగురికి స్వల్ప గాయాలు

ములుగు, మే 1: ములుగు మండలం రాంనగర్ వద్ద బుధవారం మధ్యాహ్నం ఈజీఎస్ కూలీలు విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. పలువురు స్వల్పంగా గాయపడగా ప్రాణాపాయం తప్పింది. జంగాలపల్లి వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగిన పనుల్లో పాల్గొన్న సుమారు 15 మంది మహిళలు ట్రాక్టర్‌లో తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈక్రమంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లకు ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న గడ్డపార తగిలింది. దీంతో కూలీలంతా షాక్‌కు గురయ్యారు. భయంతో అంతా ట్రాలీ నుంచి కిందకు దూకారు. దీంతో శంకపల్లి సుగుణమ్మ, బండి సారంగం, నీలం కల్పన, కొమురమ్మ, మామిడి లక్ష్మికి స్వల్పంగా గాయాలయ్యారు. వెంటనే వారిని ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితిని నిలకడ గా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని, సరిచేయాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు.


ప్రమాదంలో గాయపడ్డ మహిళలు